కథానిక:

దీవన

శ్రీ వారణాసి వేంకటరమణ శర్మ

"రాజూ, నిన్ను దేవుడెప్పుడూ రక్షిస్తాడులే!" అని కామూ అంటుంటే, రాజుకళ్లవెంట నీళ్లు రాలేయి.

రాజూ, కామూ, యిద్దరు ప్రాణస్నేహితులు. ఇద్దరూ వయస్సులో చిన్నవాళ్లే. యించుమించు యిద్దరిదీ వొక్కయీడే అని చెప్పవచ్చు. అప్పటికి వాళ్లకి యెనిమిదోయేడు నడుస్తున్నాది.

తెల్లవారేసరికి యిద్దరూ కలసి బోర్డుస్కూలుకి పోతారు. పదిగంటలకి యింటికివచ్చి భోజనము చేసేవారు. అప్పుడు కామూ, రాజు యింటికి వెళ్తాడు. యిద్దరూ కలసి గరివెళ్లవారి మామిడితోటకి వెళ్లి ఆడుకుంటారు. మామిడి చెట్లెక్కి పాటలుపాడుతూ కూర్చుంటారు. తోటిపిల్లలందరూ కలసి కోతి పిల్లలకర్ర ఆటో, లేక దొంగాటో ఆడుతూ వుండడము వారికి పరిపాటయిపోయింది. సాయంకాలము యిద్దరూ కలసి చెరువుగట్టుకి పోతారు. అక్కడ పాపడు చేపలుపడుతూ వుంటాడు. "ఓరే! పాపా! నువ్వేమిటి చేపలు పడతావు. నే నెలా పడతానో చూడు." అని రాజు అనేసరికి, పాపడు చేపలు పట్టే దోనె రాజుకి అందిస్తాడు. ఆరాయిమీద కూర్చుని రాజు అతి నేర్పుతో చేపలు పడుతూవుంటే, కాము పెద్ద కళ్లుపెట్టి చూస్తూ కూర్చుంటాడు. నిజానికి రాజు చేపలు పట్టడంలో అతి నేర్పరి. పాపడు దోనె వేసినపుడల్లా చేప ముల్లుకి తగులుకుంటుందన్న ఆశ లేదు. కాని రాజు కర్ర విసరి వేసినపుడల్లా ముల్లుకి చేప వ్రేలాడుతూ వుండవలసిందే. అందుచేతనే రాజు అడిగినప్పుడల్లా పాపడు రాజుకి దోనె అందిస్తాడు.

అలా కొంతసేపు చేపలుపట్టినతర్వాత, రాజు విసుగెత్తిపోతాడు. "పదరా, కామూ, చెరువులో దిగి యీతకొడదాము." అంటాడు. కామూ, మంత్రింపబడిన పాములా, రాజు యే పనిచెప్తే ఆపని చేస్తాడు. యిద్దరూ బట్టలు విప్పి, ఒడ్డునపెట్టి, నీటిలోకి దూకుతారు. రాజు యీతకొడ్తూ చెరువుమధ్యనివున్న కొండరాళ్లమీదకి పోతాడు. కామూ ఒడ్డునే యీతకొడ్తూ కాలయాపన చేస్తాడు. అలా విసుగెత్తినవరకూ యీదుతూ, చీకటిపడేసరికి ఒడ్డుకి చేరుకుంటారు. అప్పుడు బట్టలు కట్టుకొని "పాపా యిక యింటికి పోతాము" అని పాపడితో చెప్పి బయలుదేలుతారు.

త్రోవలోనే కోవెల. కోవెలలోకి పోయి, దేముడికి నమస్కరిస్తూ, వారికి తెలిసిన పద్యాలు చదువుతారు. సున్నయ్య పూజారివారికి యిచ్చిన ప్రసాదము తింటూ యింటికి బయలుదేరుతారు. అలా, రాత్రి యింటికి చేరేసరికి, ఏడుగంటలవుతుంది.

వీళ్లిద్దరూ, రోజులో చాలా మట్టుకు, యేతోటలోనో, చెరువుదగ్గరో కాలక్షేపము చేస్తారు. యింటిదగ్గర వాళ్లున్నది చాలా తక్కువ. దీనికి కారణము లేకపోలేదు.

కామూ చిన్నప్పుడే వాని తల్లిదండ్రులు పోయేరు. అందుచేత పినతల్లియిల్లు చేరవలసి వచ్చింది. పినతల్లికి పిల్లలు లేకపోలేదు. ఆమెకు నల్గురు మగపిల్లలు, యిద్దరు ఆడపిల్లలు. కామూ యేడోవాడయ్యేడు. పినతల్లియింట్లో కామూకి నిజానికి తావేలేదు. అయినా, తల్లిదండ్రులు లేనిబిడ్డ. దగ్గరకు చేరదీయకపోతే లోకు లేమనుకుంటారో అని తన యింటికి తెచ్చింది. ఆమెయొక్క భర్త జోగారావు, అట్టే స్థితిపరుడు కాడు. భూములవల్ల కొంచము ధాన్యము వస్తాయి. ఆవూరులోనే బోర్డుస్కూలు మేష్టరుగా పనిచేస్తున్నాడు. కాని యింటిలో బలమైన సంతానము వుండటముచేత, తన సంపాదన చాలకుండావుంది. కరువులో అధికమాసములాగ, యీబరువుకితోడు, కామూ వొకడు తయారయ్యేడు. వాని బాధ్యతంతా అతనిమీదే పడింది.

అయినా, యీమాత్రము దానికి జోగారావు విసుగుకోవలసిన మనిషి కాడు. తన అన్నకొడుకంటే అతని కమితమైన ప్రేమ. తన తల్లిదండ్రులు పోయినప్పుడు, తన అన్నే, అతనిని దగ్గరవుంచుకొని, కొద్దో గొప్పో చదువు చెప్పించి పెద్దవాడిని చేశాడు. యీనాడు, తను కొద్దో గొప్పో తెచ్చుకుంటున్నాడు. అలాంటప్పుడు తన అన్నకొడుకుని, యింటిలో పెట్టుకోపోతే లోకు లేమనుకుంటారు.

అసలు, లోకు లేమనుకుంటారన్న విషయముతో అతనికి సంబంధము లేదు. తన అన్నంటే అతని కదోవిధమైన ప్రేమ. అన్న చనిపోయిన తర్వాత కాముని, తన అన్న బదులు ప్రేమిస్తున్నాడు. దీని కంతటికి కారణము, కామూ అతని అన్నకొడుకు కవడమేనా? దీనికి సరియైన కారణము చెప్పలేము.

ఏది యెలాగైతేనేమి, కామూ, పినతండ్రిగారింట్లో బస యేర్పాటుచేసుకున్నాడు. పినతండ్రి యెప్పుడూ కాముని కోపపడియెరుగడు. కాని పినతల్లిమాత్రము, అలా ఓర్పు వహించగల మనిషి కాదు. యేలాగోలాగు కాముని కోపపడుతూనే వుంటుంది. కామూ అల్లరచేసినట్టయితే, దెబ్బలు తినవలసిందే. కామూ అసలు అల్లరిపిల్లవాడు కాడు. కాని యింటిల్లు చాకిరీచేసి అలసివున్న పినతల్లికి, కామూ యేచిన్న తప్పపని చేసినా, పెద్దతప్పుగా కనబడుతుంది అందుచేతనే కామూపై కలియబడుతుంది. పినతల్లి కోపపడుతూవుంటే, కామూ యేడుస్తూ వొకమూల కూర్చుంటాడు.

యింటివద్దవుంటే, పినతల్లిచేత చీవాట్లు తినాలికదా అని, కామూ రాజుగారింటికి పోతాడు. రాజు, కామూ కలసి వూరుబయటికి పోయి ఆడుకుంటారు. ఇది వారి నిత్యజీవితము.

కాని, యిలా అట్టే రోజులు గడవలేదు. రాజు తండ్రిలేని బిడ్డ. తల్లి తను మాత్రమే వుండేవారు. మేనమామకు విశాఖపట్నములో ఉద్యోగము. ఒకనాడు హఠాత్తుగా తల్లికి జబ్బుచేసింది. చెల్లెలికి వొంట్లో బాగులేదుకదా అని, రాజుయొక్క మేనమామ, వీళ్లున్న గ్రామము వచ్చేడు. కొన్నాళ్లు బాధపడి, రాజుతల్లి స్వర్గస్థురాలయింది. రాజు తల్లిదండ్రులు లేని బిడ్డయిపోయాడు!

అందుచేత, మేనమామతో రాజు వెళ్లిపోతున్నాడు. బండి రాజుయింటిముందు ఆగింది. సామాన్లు అన్నీ బండిలో పెట్టారు. తల్లి చనిపోయిందనే చింతతో, రాజు, అరుగుమీద ఒకమూల కూర్చున్నాడు. సామాన్లు అన్నీ బండిలో పెట్టినతర్వాత, మేనమామ రాజుని యెత్తుకొని బండిలో కూర్చోపెట్టేడు. బండి కదిలింది. కాని, యింతలో ఒక యింటిముందు నుండి బండి పోతూంటే, "కామూ" అని కేకవేస్తూ రాజు బండి దిగేడు. అదే జోగారావుగారిల్లు. అరుగుమీద కామూ నించోని, రాజుని పెద్దకళ్లతో చూస్తున్నాడు.

"కామూ, నేను వెళ్తున్నాను." అని రాజు చెప్పగల్గేడు. అంతలో రాజుకళ్లలో నీళ్లు తిరిగాయి. అరుగుమీద నించొనివున్న కామూ, పరుగున బండిదగ్గరకు వచ్చేడు.

"నువ్వు కూడా వెళ్ళిపోతున్నావా, రాజూ!" అని జాలిగా అన్నాడు. అలా అంటూనే, కామూ రాజు చెయ్యిపట్టుకొని యేడ్చేడు. కాని యింతలో బండిలోవున్న మేనమామ "వేగరముగా, రా రాజూ" అని కేకవేశాడు.

రాజు, అతి జాలిగా కాముప్రక్క చూసేడు. అప్పుడే కామూ అలా అన్నాడు. "రాజూ, నిన్ను దేవుడెప్పుడూ రక్షిస్తాడులే" దేవుడెలా రాజుని రక్షిస్తాడో కామూ కేమి తెలుసు. అయినా అలా దీవించేడు. యీ మాటలతో యిద్దరు బాలస్నేహితులు విడిపోయారు.

* * *

రాజు వెళ్ళిపోయినదగ్గరనుంచి కామూకి తోచడములేదు. ఊరిచెరువులో యీతకొట్టడానికి, కామూకి తోడుదొరకలేదు. యిక యింట్లోనే వుండవలసింది.

ఆరోజున పండుగ. యింట్లో పిండివంటలు చేస్తారు. కామూకి కొత్తబట్టలు కుట్టించేరు. అవి కట్టుకొని భోగిమంటదగ్గర కూర్చున్నాడు. యింతలో పినతల్లి పిలవడముమూలాన యింటికి వెళ్లేడు.

"కామూ, కరివేపాకుచెట్టెక్కి ఆకు కొంచము కోసిపెట్టు." అని చెప్పింది: పెరట్లోనే కరివేపాకు చెట్టు. చెట్టెక్కేడు. కరివేపాకురెమ్మలు కోస్తున్నాడు. యింతలో కాముగుండెలు ఝల్లుమని కొట్టుకోడము, కళ్లు మూతలుపడటము, కామూ క్రిందబడటము, అన్నీ ఒక్కమారే జరిగాయి. గొల్లుమని కేకవేశాడు. పినతల్లి కంగారుపడుతూ పెరట్లోకి వచ్చేసరికి, కాలువిరిగిన కామూ, బురదలో పడివుండటము చూసింది.

కామూకి తెలివివచ్చేసరికి, కాళ్లకు కట్టుకట్టి పరుపుమీద పడివున్నాడు. ఆదినమే కాముని పట్నము తీసుకొని వెళ్లేరు. ఆసుపత్రి చేరేసరికి సాయంత్రమయింది. డాక్టరు, కాముని చూసి, విశాఖపట్నము తీసుకొని వెళ్ళమని చెప్పాడు. జోగారావు గుండెలు దడదడా కొట్టుకున్నాయి.

కాముని విశాఖపట్నము ఆస్పత్రికి తీసుకుపోయేరు. అక్కడ కుడికాలు తీసేశారు.

కామూ, ఆస్పత్రిలో పడుకున్నాడు. కాని నిద్రపట్టదు. యింతకుముందు అందమైన కామూ, యిప్పుడు అంగవిహీనుడైపోయేడు. యిక జీవితమల్లా, యిల్లానే గడపాలా, అని ఆలోచిస్తూ ఆ ఆస్పత్రిలో ఒకమూల పడుక్కొనివున్నాడు.

యింతలో రాజు జ్ఞాపకము వచ్చేడు. యీ విశాఖపట్నములోనే రాజు వున్నాడు. కాని అతనికీ సంగతి తెలియడమెట్లా? జోగారావుగారిని, రాజుగురించి అడిగేడు.

"వాడెక్కడున్నాడో, నా కేమి తెలుసురా" అని విసుగుకుంటూ అన్నాడు; కామూ ఆదినము మొదలు రాజునిగురించి అడగడము మానివేశాడు. కాని, రాజుని తలవని జాము లేదు. సంవత్సరము క్రిందనే వాళ్లిద్దరూ ఆడుకునేవారు. యీనాడు విడిపోయేరు. ఒకడు అంగవిహీనుడై ఆస్పత్రిలో పడ్డాడు. ఇక రెండోవాడో?

* * *

రాజు, మేనమామతో విశాఖపట్నము చేరుకున్నాడు. మేనమామ అక్కడ పెద్ద ఉద్యోగస్థుడు. అందుమూలాన వీరింటికి పెద్దమనుషులు వస్తూవుండటము ఆశ్చర్యమైన విషయము కాదు.

ఆదివారం ఉదయము ఏడు గంటలయింది. రాజు, అరుగుమీద నించొని పరధ్యానముగా చూస్తున్నాడు. "అబ్బాయీ!" అని భుజముమీద తట్టిన చప్పుడు విని త్రుళ్లిపడ్డాడు. వెనుదిరిగి చూసేసరికి మూర్తిగారు కన్పడ్డారు. మూర్తిగారు విశాఖపట్నము కాపురస్థుడే. మంచి స్థితిపరుడు. రాజుని చూచిన దగ్గరనుండి, అతనిని తనుపెంచి పెద్దవాడినిచేద్దామనే ఉద్దేశము కలిగింది. తనకు పుత్రసంతానము లేకపోవడమే దీనికి బలమైన కారణము. ఈ విషయమై రాజు మేనమామతో మాట్లాడాడు.

రాజు అదృష్టవంతుడే! ఆదివారమునాడే, మూర్తిగారింటికి, రాజు, కారులో ప్రయాణము సాగించాడు.

* * * *

ఆస్పత్రిని, నిశరాత్రిలో చూడలేము. ఆ వాతావరణములో నిశీథసమయమున, తెలివితో, మానవమాత్రుడు నిలబడ్డాడంటే వానికనేక విధములైన ఆలోచనలు తట్టుతాయి. యిది సహజము. ఆస్పత్రిలో నుండేది రోగిసమాజము. అందరూ కృశించిపోయినవారే. ఎక్కడ చూచినా అంగవిహీనులే. ఆ సమాజముమధ్య నిలబడ్డ కవి ప్రేమగీతాలు వ్రాయలేడు. ఏదో స్త్రీ మూర్తిని మనస్సులో పెట్టుకొని, దానికి ప్రేమారాధన చేయలేడు. యీ సమాజమునిండా బాధపడినవాళ్లే. వీళ్లకి చికిత్సచేయాలి. వీళ్లతో అక్కడున్నవాళ్లు కూడా బాధపడాలి. "ప్రేమమయమే యీ జగము" అని సెరిపాటలు పాడుతూ సముద్రపుటొడ్డుకి వాహ్యాళికి పోతూ డరు.

ఈ విషయముగురించి జోగారావుగారికి బాగా తెలుసు. కామూ రోగిష్టి. ఎప్పుడు మంచముపై పడుంటాడు. వానికి నిద్రపట్టదు. వుండివుండి, "అబ్బా! నొప్పి!" అని గొల్లుమని యేడుస్తాడు. అప్పుడు జోగారావుగారు "ఫరవాలేదు నాయనా" అని ఓదారుస్తాడు. రాత్రి 12 గంటలయినా జోగారావుగారికి నిద్రపట్టదు. కామూ యిప్పుడు అంగవిహీనుడు. వీనికెంత చదువుచెప్పించినా తనకాళ్లపై నిలబడలేడు. వీని గతి యేమి కావలసిఉన్నది. యీ విషయమై తలుచుకుంటే జోగారావుగారి గుండెలు కొట్టుకుంటాయి. కాముని చూచినప్పుడల్లా గుండె కరిగిపోతుంది. కళ్లవెంట రెపరెప నీళ్లుకారుతాయి. "ఏమికావలసివుందో, అది అవుతుందని" వూరుకోవలసిన మనిషి కాడు. అందుచేతనే విచారముతో సగము క్షీణించిపోయారు, జోగారావుగారు.

* * *

కాముకాలు తీసేశారు. గాయము నయమయింది. ఆస్పత్రి విడిచి జోగారావుగారిల్లు చేరుకున్నాడు.

శనివారమునాడు జోగారావుగారింట్లో భజన. ఆడవాళ్లందరు అక్కడికి హాజరయారు. కామూ బుద్ధిగా ఒకమూల కూర్చున్నాడు.

శొరుగువారి వెంకమ్మ యిలా మొదలెట్టింది. "మనకామూ, యిక యిలా, యీవూరిలో పడివుండవలసిందేనా"

"మరేమి చేస్తాడమ్మా, సొట్టవాడు, యెక్కడకెళ్ళితేమాత్రము చెల్లుతాడు." అంది పినతల్లి.

"జోగారావుగారికొచ్చింది యీకష్టమల్లా!"

యిలా, ఆడవాళ్లందరూ మాట్లాడుకొంటూ వుంటే కామూ విన్నాడు. "నిజంగా యీకష్టమంతా జోగారావుగారికే వచ్చింది." అని కామూ చిట్టిహృదయము చెప్పింది." యెన్నాళ్ళని యిక్కడ వుంటాను. యెంతపెద్దవాడినైనా నేనేమి చేయగలను. జోగారావుగారింట్లో వుండి, అతనికి కష్టము కల్గించడము దేనికి? మరేమిచేయాలి? రాజుదగ్గరకు పోతేనో? రాజు యెక్కడున్నాడు. అతనెన్నికష్టాలు పడుతున్నాడో, అక్కడికి నేను దేనికి? అయితే మరియింకెక్కడికి? యింకెక్కడా వుండొద్దు. నాతల్లిదండ్రులదగ్గరకే పోతాను!" అని అనుకొని భజనలోంచి లేచిపోయేడు. కుంటుకుంటూ అరుగుమీదికి వెళ్లిపోయేడు.

ఆనాడురాత్రి 12 గంటలవుతుంది. కామూ కుంటుకుంటూ జోగారావుగారి మంచమువద్దకు వెళ్లేడు. అతనికి తుది నమస్కారము చేసేడు. పినతల్లివద్దకు వెళ్ళి ముఖములోకి చూసేడు. "యిక మీకు బాధ కల్గించనులెండి." అని మనస్సులో అనుకొన్నాడు. కుంటుకుంటూ ఆరాత్రి యెక్కడికో బయలుదేరేడు.

తెల్లవారేసరికి, వూరిచెరువులో తేలుతున్నాది కాముశవము.

ఆనాడే తపాలామనిషి జోగారావుగారికి వుత్తరము తెచ్చేడు. అది విప్పి చదువుతుండగనే జోగారావుగారి కళ్లలో నీళ్లు తిరిగాయి.

"మాశావే, మనకామూకి, రాజు యెలా ఉత్తరము వ్రాశేడో."

"ఏమనండీ!"

"యేమనా! అయ్యో! నాకామూ! నా బంగారు తండ్రీ, ఎంత దురదృష్టవంతుడివిరా నీకెక్కడిచావు యోగము వచ్చిందిరా.

అని జోగారావుగారు భోరున ఏడుస్తూ వుంటే, పినతల్లికూడా కళ్లతడి పెట్టుకుంది.

"అయితే యేమని వ్రాశేడండీ, రాజు?"

"రాజుని మూర్తి అనే అతను పెంచుకున్నాడట. యిప్పుడు రాజు, మంచి ఆస్తికి అధికారట. అందుచేత కాముని అక్కడికి రమ్మన్నాడు. యిద్దరూ ఒక యింట్లోనే వుండి చదువుకోవచ్చుట. యిద్దరూ హాయిగా...... యేదో యిలా వ్రాశాడు. కాని... కాని... మరి కామూ యేడీ! రాజూ! నీ కేమని జవాబు వ్రాయాలి. వాడి చావువార్త వింటే నీవేమి బెంగపెట్టుకుంటావో. అయ్యో! అమ్మా!..." అని జోగారావుగారు కుర్చీలో కూలబడ్డారు.

విశాఖపట్నములో, రాజు, రోజూ తపాలావాడిగురించి చూస్తున్నాడు. "కామూ యెప్పటికి జవాబు వ్రాయడేమి చెప్మా!"